క్లుప్తంగా...

బాల్య వివాహాలను అరికట్టాలి


కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సువర్ణ

అడ్డగుట్ట: ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం లోహియానగర్, ఏసీఎస్ నగర్‌లలో కిశోర బాలికలతో సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు, జెండర్ ఇక్వాలిటీ, చైల్డ్ లేబర్ వంటి పలు అంశాలపై ఫౌండేషన్ ప్రతినిధురాలు సువర్ణ అవగాహన కల్పించడంతో పాటు నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రయత్నించాలని నూతన కమిటీకి సూచించారు. బాల్య వివాహం జరుగుతుందని తెలిసిన వెంటనే 1098, 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. బాల కార్మికులుగా ఉన్న పిల్లలను పాఠశాలలకు పంపించాలని, ఆడా, మగ పిల్లల మధ్య తేడాలు లేకుండా సమానత్వం మొదటగా ఇంటి నుంచే మార్పు రావాలన్నారు. సంఘటితంగా ఉంటేనే ఇవన్నీ సాధించగలమని, అందుకే నూతన కమిటీలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అందులో భాగంగా లోహియా నగర్ కమిటీ పేరు సావిత్రీబాయి పూలే కమిటీ, ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ కమిటీ పేరు విక్టరీ కమిటీగా పేర్లు పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మదర్స్ కమిటీ ప్రతినిధులు పుష్పలత, కిశోర బాలికల కమిటీ సభ్యులు మౌనిక, వైష్ణవి, ఐశ్వర్య, ప్రవళిక, శాంతిక, సంధ్య, అశ్విత, పల్లవి, వర్ష పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

లాలాపేట: ఎస్ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం తార్నాకలోని బాప్టిస్టు చర్చి ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. తార్నాక పరిసర ప్రాంతాల నుంచి శిబిరానికి హాజరైన సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ మేరీ గ్లోరియానా, సెక్రటరీ స్టెల్లా మ్యూరియల్, కెనెడి, సామ్యూల్ జాన్ పాల్గొన్నారు.

టీటీడీపీ నూతన కార్యవర్గంలో కంటోన్మెంట్ నేతలకు చోటు


కాసానిని సన్మానిస్తున్న ముప్పిడి గోపాల్

రసూల్‌పురా: తెలంగాణలో టీటీడీపీ విస్తరణలో భాగంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ నూతన కార్యవర్గంలో కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి ఇద్దరికి ప్రాధాన్యం కల్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గడ్డి పద్మావతి, రాష్ట్ర అధికార ప్రతినిధిగా ముప్పిడి గోపాల్‌ను కాసాని నియమించారు. ఈ సందర్భంగా గురువారం అమీర్‌పేటలోని కాసానిని ఆయన నివాసంలో ముప్పిడి గోపాల్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పార్టీ అభివృద్ధికి బాధ్యతగా కృషి చేస్తానని ఈ సందర్భంగా ముప్పిడి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాసాని వీరేశ్, సాయి, సురేష్, ప్రకాష్, బాబు, హన్మంత్‌రావు, వేణుగోపాల్ రెడ్డి, సాయి కుమార్, రాజు అంజనేయులు యాదవ్ పాల్గొన్నారు.

టీఎస్ లాసెట్‌కు 13 వేల మంది గైర్హాజరు

జూన్ మొదటి వారంలో ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్ లాసెట్, పీజీ లాసెట్–2023 ప్రశాంతంగా ముగిసింది. గురువారం తెలంగాణ, ఏపీలో జరిగిన లాసెట్ 3 సంవత్సరాలు, 5 సంవత్సరాలు, పీజీ లాసెట్–2023కు 43692 మంది దరఖాస్తు చేసుకోగా 36218 మంది పరీక్షకు (టీఎస్‌లో 83 శాతం, ఏపీలో 77శాతం) హాజరుకాగా 13 వేల మంది గైర్హాజరైనట్లు అధికారులు తులిపారు. ఈ నెలాఖరులో కీని విడుదల చేసి జూన్ మొదటి వారంలో ఫలితాలను విడుదల చేయనున్నట్లు అధికారులు చెప్పారు.

జీహెచ్‌ఎంసీలో పలువురు అధికారుల బదిలీలు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బేగంపేట్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ పరిధిలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ కమిషనర్ లోకేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. బేగంపేట్ సర్కిల్ పరిధిలో నూతన అసిస్టెంట్ మున్సిపల్ కమిషన్లుగా (ఏఎంసీ)గా ఆండాలు దేవీ, కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన బి.దయానంద్, శ్రీనివాస్‌రావు మల్కాజిగిరి, ఉప్పల్ సర్కిళ్లకు బదిలీ అయ్యారు. అదే విధంగా సూపరింటెండెంట్‌లు ఆనంద్, కిరణ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన నర్సింహరెడ్డి, రాంబాబులు మల్కాజిగిరి, సికింద్రాబాద్ సర్కిళ్లకు బదిలీ అయ్యారు. నూతన ఏఎంసీలుగా బాధ్యతలు స్వీకరించిన ఆండాలు దేవీ, కుమార్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. తమ బాధ్యతల నిర్వహణలో ఎక్కడా రాజీపడబోమన్నారు.

కుట్టివెల్లోడి ఆస్పత్రికి మహర్దశ

- 70 పడకల ఆసుపత్రి నిర్మాణం పనులకు కసరత్తు చేస్తున్న అధికారులు
- రోగుల కోసం అధునాతన వసతులు
- త్వరలోనే పనులు ప్రారంభం


కొత్తగా నిర్మించనున్న అధునాతన భవనం నమూనా చిత్రం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి ప్రజలకు 1963లో కుట్టివెల్లోడి ఆసుపత్రి సేవలు అందుబాటులోకి వచ్చాయి. మొదటోల్ ఐదారు పడకల వసతితోనే ఇక్కడ మెటర్నిటీ సేవలు అందుబాటులో ఉండగా క్రమేణా 16 పడకల మెటర్నిటీ ఆసుపత్రిగా విస్తరించారు. 20 ఏళ్ల క్రితం నుంచి ప్రసూతి సేవలతో పాటు ఈ ఆసుపత్రిలో సాధారణ వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారు. తాజాగా ఈ ఆసుపత్రికి అధునాతన భవనాన్ని నిర్మించనున్నారు. 70 పడకల వసతితో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలను అందుబాటులోకి తేనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.12.75 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇక్కడి రెండు భవనాల్లోని వైద్యసేవలను తాత్కాలికంగా ఇతర భవనాల్లోకి మార్చారు. ఆసుపత్రి పురాతన భవన సముదాయం కూల్చివేతల పనులు తుది దశకు చేరాయి. జూన్ మొదటివారంలో ఆసుపత్రి నిర్మాణం పనులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పేరు వచ్చింది ఇలా..

కుట్టివెల్లోడి అనగానే సీతాఫల్‌మండి ప్రాంతంలో గుర్తుకు వచ్చేది ప్రసూతి ఆసుపత్రి పేరు అని, అంతేగాని కుట్టివెల్లోడి అంటే ఒకప్పటి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ పేరు అని చాలా మందికి తెలిదు .1962 ప్రాంతంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన మహిళ పేరు కుట్టివెల్లోడి.సీతాఫల్‌మండి ప్రాంత సందర్శనకు ఆ కాలంలో జిల్లా కలెక్టర్ కుట్టివెల్లోడి వచ్చారు. వైద్య సదుపాయాలు లేక గర్భిణులకు ఎదురవుతున్న ఇబ్బందులను సీతాఫల్‌మండి ప్రాంత ప్రజలు ఆమెకు వివరించారు. అప్పటికప్పుడు స్పందించిన కలెక్టర్ సీతాఫల్‌మండిలో మెటర్నిటీ ఆసుపత్రి నిర్మాణం కోసం ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశించిన ఏడాది కాలంలోనే ఆసుపత్రి నిర్మాణం జరిగిపోయింది. అంతేకాదు అనతికాలంలోనే ప్రసూతి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. అడిగిందే తడవుగా మెటర్నిటీ సేవలను అందుబాటులోకి తెచ్చిన కలెక్టర్ పేరును స్థానికులు ఆసుపత్రికి నామకరణం చేసుకున్నారు.


సీతాఫల్‌మండిలోని కుట్టివెల్లోడి ఆసుపత్రి భవనం

70 పడకలతో..

కుట్టివెల్లోడి ఆసుపత్రి త్వరలో 70 పడకల ఆసుపత్రిగా రూపాంతరం చెందనుంది. ఇక్కడి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ కృషి ఫలితంగా అధునాతన ఆసుపత్రి భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.12.75 కోట్ల నిధులు మంజూరు చేసింది. త్వరలో పనులు ప్రారంభించేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. ఇక్కడి పాత భవనాల్లో కొనసాగుతున్న మెటర్నిటీ సేవలు ఇతర భవనాల్లోకి బదలాయించారు. మెట్టుగూడలోని రైల్వే ఆసుపత్రి సమీపంలోని ఆర్టీసీ భవనంలోకి మెటర్నిటీ సేవలు, సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్క భవనంలోకి సాధారణ వైద్య సేవలు బదలాయించారు.

రోగులకు పెద్ద దిక్కు



సీతాఫల్‌మండితో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు కుట్టివెల్లోడి ఆసుపత్రి పెద్ద దిక్కుగా మారనుంది. డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ కృషితో ఈ ప్రాంత ప్రజలు వైద్య సేవల నిమిత్తం గాంధీతో పాటు సుదూర ప్రాంతాలకు వెళ్లే అవసరం ఉండదు. అన్ని రకాల వైద్య సేవలు, పరీక్షలు అందించే కేంద్రంగా అధునాతన వసతులతో కుట్టివెల్లోడి ఆసుపత్రి ప్రగతి సాధించనుంది.

–సామల హేమ, కార్పొరేటర్

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం



మౌలిక వసతులతో పాటు లష్కర్ ప్రజలకు విద్యవైద్య సదుపాయాలు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. త్వరలోనే కుట్టివెల్లోడి ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. రోగులు, విశాలమైన వాహనాల పార్కింగ్ సదుపాయాన్ని సెల్లార్‌లో ఏర్పాటు చేస్తాం. ఓపీ, అత్యవసర విభాగం, ఫార్మసీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం.

– టీ.పద్మారావుగౌడ్, డిప్యూటీ స్పీకర్

సన్‌స్క్రీన్‌ల వాడకంపై జాగ్రత్తలు తప్పనిసరి


డాక్టర్ మాధవి

సనత్‌నగర్: చర్మ సంరక్షణకు సరైన సన్‌స్క్రీన్‌ను ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ వైద్యురాలు, గోల్డ్‌మెడలిస్ట్ డాక్టర్ పి.మాధవి సూచించారు. మే 27న జాతీయ సన్ స్క్రీన్ డే సందర్భంగా సన్ స్క్రీన్ వాడకంపై పలు కీలకమైన సూచనలు, మెలకువలు, ఎంపిక విధానం, జాగ్రత్త గురించి గురువారం ఆమె 'సాక్షి'కి వివరించారు. సన్‌స్క్రీన్ ఎంపిక విషయంలో సాధ్యమైనంతగా ఉత్తమ రక్షణనిచ్చే వాటిని ఎంపిక చేసుకోవాలని ఇందుకోసం కొన్ని చిట్కాలను సైతం పాటించాలన్నారు. బ్రాడ్–స్పెక్ట్రమ్ సన్‌స్క్రీన్లు యూవీఏ, యూవీబీ కిరణాలను నిరోధిస్తాయన్నారు. చాలా సన్ స్క్రీన్లు అధిక సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్ (ఎస్‌పీఎఫ్)ను కలిగి ఉన్నప్పటికీ అవి కేవలం యూవీబీ కిరణాల నుంచి మాత్రమే రక్షిస్తాయే తప్ప యూవీఏ కిరణాల నుంచి కాదనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. కనీసం 30+ ఎస్‌పీఎఫ్ ఉన్న సన్ స్క్రీన్‌ను ఎంచుకోవాలన్నారు. సన్‌స్క్రీన్లు కాలక్రమేణా వాటి ప్రభావాన్ని కోల్పోతాయని, వాటిని ఉపయోగించేముందు గడువు తేదీపై శ్రద్ధ వహించాలన్నారు. ఈత కొడుతుండడం, చెమటలు పట్టే సందర్భం వచ్చినప్పటికీ కనీసం 15 నిమిషాల ముందు అప్లై చేయాలనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. జాతీయ సన్‌స్క్రీన్ అవగాహన మాసం సందర్భంగా చర్మాన్ని రక్షించుకోవడానికి ప్రతిరోజూ సన్‌స్క్రీన్ ధరించాలని ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

జీఓ 111 రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి


మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి

కంటోన్మెంట్: జంట జలాశయాల పరిరక్షణకు ఉద్దేశించిన జీఓ 111ను రద్దు చేయాలని రాష్ట్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పర్యావరణ వేత్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కరుణాకర్ దేశాయ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సదస్సులో పలువురు వక్తలు పాల్గొని కీలక ఉపన్యాసాలు చేశారు. అనంతరం జంట జలాశయాల పరిరక్షణే లక్ష్యంగా ఐక్య కార్యాచరణ ప్రకటించారు. ఈ జీవో రద్దు వల్ల అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం బలపరిచినట్లయింది. స్థానిక ప్రజలను భాగస్వామ్యులను చేయకుండా, వారి 'అభివృద్ధి'పేరు మీద ఈ ప్రాంతాన్ని ధనికులకు, వలస వచ్చినవాళ్లకు, తెలంగాణ వ్యతిరేకులకు పందేరం చేయడం తెలంగాణ ప్రభుత్వానికి తగదన్నారు. తెలంగాణ ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని తీర్మానం చేస్తూ పలు డిమాండ్‌లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, ప్రొఫెసర్ దొంతి నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ సుబ్బారావు, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి, హైకోర్టు న్యాయవాది రచనా రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ పీవీ శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్‌యాదవ్, ఓల్డ్ సిటీ టీజేఏస్ కన్వీనర్ షాబాజ్ అలీ, కన్నెగంటి రవి, పిట్టల శ్రీశైలం, పిట్టల రవి, అనురాధరెడ్డి, మోహన్ గురు స్వామి, పిట్ల నాగేశ్ పాల్గొన్నారు.

విలీనం కోరుతూ పీఎం కార్యాలయానికి పోస్టుకార్డులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం కోరుతూ పోస్టు కార్డు ఉద్యమం ద్వారా చేపట్టిన ప్రజాభిప్రాయ పోస్టుకార్డులను ప్రధానమంత్రి కార్యాలయానికి పోస్టాఫీస్ ద్వారా పంపించినట్లు కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్ తెలిపారు. వికాస్ మంచ్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ఆరు విడతల్లో వికాస్ మంచ్ ఆధ్వర్యంలో ఐదువేల మంది విలీనం అంశంపై తమ అభిమతం తెలుపుతూ పోస్టు కార్డులు రాశారని వాటిని పీఎం కార్యాలయానికి పంపించినట్లు చెప్పారు. త్వరలో మిగిలిన వార్డుల్లో వికాస్ మంచ్ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వికాస్ మంచ్ అధ్యక్షుడు గడ్డం ఏబెల్, ప్రభుగుప్త, ఫస్సీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వికాస్ మంచ్ ప్రతినిధులు

త్వరలో వార్డు కార్యాలయాల ప్రారంభం

డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి

బన్సీలాల్‌పేట్: జీహెచ్‌ఎంసీ బేగంపేట్ పరిధిలో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాలను త్వరలో ప్రారంభించడానికి సర్వం సిద్ధం చేసినట్లు డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి వెల్లడించారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల ముంగిట్లోనే వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి వార్డు కార్యాలయాల్లో అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. ఇటు ప్రజలు, అటు అధికారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను వార్డు కార్యాలయాల్లోని ఆయా విభాగాల అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించే విధంగా అధికారులకు దిశానిర్దేశం చేశామని ముకుందరెడ్డి పేర్కొన్నారు. బన్సీలాల్ పేట్, రాంగోపాల్‌పేట్, మోండా మార్కెట్, బేగంపేట్ డివిజన్ల పరిధిలో నూతన వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇక్కడ వార్డు ఆఫీసర్‌తో పాటు జీహెచ్‌ఎంసీ విభాగాలకు చెందిన అధికారులు, విద్యుత్, జలమండలి అధికారులు కూడా వార్డు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. జూన్ మొదటి వారంలో వార్డు కార్యాలయాలను ప్రారంభిస్తామని ఇప్పటికే ఆయా వార్డు కార్యాలయాలకు అధికారులు, సిబ్బందికి బాధ్యతలు అప్పగించామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా వార్డు కార్యాలయాలకు ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రజలు వార్డు కార్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిప్పంటించుకుని విద్యార్థి ఆత్మహత్య


శ్రీకృష్ణ చైతన్య (ఫైల్)

లాలాపేట: చదువులో వెనకబడడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్యా చేసుకున్న ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ భాస్కర్ వివరాల ప్రకారం.. న్యూ నల్లకుంటకు రామాలయం ప్రాంతానికి చెందిన శ్రీకృష్ణ చైతన్య (18) డీడీ కాలనీలోని ఓ కళాశాలలో ఇటీవలే ఇంటర్మీడియేట్ పూర్తి చేశాడు. ఇటీవల విడుదలైన ఓ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత కాకపోవడంతో మనస్తాపం చెందాడు. గురువారం మధ్యాహ్నం ఓయూ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంకు వెళ్లే దారిలో నిర్మానుష్య ప్రాంతానికి వచ్చి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలు తాళలేక రోడ్డుపైకి రాగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే శ్రీకృష్ణ చైతన్య శరీరం 80 శాతం కాలిపోయి ఉన్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు.

రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి


రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: ఎంపీ రేవంత్ రెడ్డి, గొల్లకురుమలు, మంత్రి శ్రీనివాస్ యాదవ్‌కు క్షమాపణ చెప్పాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ నుంచి గాంధీ భవన్‌కు ర్యాలీ చేపట్టిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. ఆగ్రహించిన విద్యార్థులు రేవంత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరసనలో టీజీవీపీ రాష్ట్ర అధ్యక్షులు నక్క శ్రీశైలంయాదవ్, బీఆర్ఎస్, ఓయూ జేఏసీ నాయకులు కదారి స్వామియాదవ్, శ్రీకాంత్‌యాదవ్, శరత్‌యాదవ్, శ్రావణ్‌యాదవ్, శివయాదవ్, గణేష్ యాదవ్, నాగరాజు, ప్రకాష్, మల్లేష్, వీరేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

టీపీసీసీ పదవి నుంచి తప్పించాలి..

లాలాపేట: రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కించపరిచేలా మాట్లాడిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము అశోక్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇందిరాపార్కు వద్ద గొల్లకురుమల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమానికి అశోక్ ఆధ్వర్యంలో పలువురు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో రానున్న ఎన్నికల్లో గొల్లకురుమలంతా ఏకమై రాజకీయంగా రేవంత్‌రెడ్డికి డిపాజిట్ రాకుండా గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. లేదంటే పీసీసీ పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామ్‌చందర్‌యాదవ్, శ్రీనివాస్ యాదవ్, మధు యాదవ్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలకు ఆకర్షితులై బీజేపీలో చేరికలు

రసూల్‌పురా: ప్రధాన మంత్రి ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన బీజేపీలో చేరుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉద్యోగి ఆర్.పరశురాం గురువారం బీజేపీలో చేరగా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.లక్ష్మణ్‌తో కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచం మెచ్చిన నాయకుడని తొమ్మిదేళ్లల్లో మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అన్నారు. ప్రపంచంలోనే వేలాది రాజకీయ పార్టీలు ఉన్నా అతిపెద్ద పార్టీ అయిన బీజేపీ గిన్నీస్ రికార్డు కలిగి ఉందన్నారు. పదేకరాల్లో అద్దాల మేడ కట్టుకున్న కేసీఆర్ పేదలకు ఎన్ని డబుల్ బెడ్రూమ్‌లు కట్టించారని ప్రశ్నించారు. పరశురాం మాట్లాడుతూ.. 23 ఏళ్లు కంటోన్మెంట్ ఉద్యోగి, కార్మిక నాయకుడిగా ప్రజల సమస్యలు చూసి చలించి ఇంకా 12 ఏళ్ల సర్వీసు ఉన్నప్పటికి ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజలకు సేవ చేయాలనే తపనతో బీజేపీలో చేరుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్, బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, బీఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.


కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న పరశురాం

ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి

రాంగోపాల్‌పేట్: రాష్ట్రంలో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. గురువారం వెస్ట్ మారేడుపల్లిలోని తన నివాసంలో బాసర, కొమురవెల్లి, సికింద్రాబాద్ మహంకాళి, జబల్‌పూర్ తదితర ప్రముఖ దేవాలయాలకు చెందిన వేద పండితులు మంత్రి శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సభ్యులను వేద మంత్రాలతో ఆశీర్వదించారు. లక్ష్మి ప్రసాదశర్మ ఆధ్వర్యంలో 27 మంది వేద పండితులు వేదమంత్రాలను పఠించారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌యాదవ్, సాయి కిరణ్‌యాదవ్ దంపతులు వేద పండితులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహంకాళి ఆలయ ఈవో మనోహర్‌రెడ్డి, కమిటీ సభ్యులు జగదీష్ ప్రసాద్ వర్మ, మహేందర్, అరుణ్ భట్, లావణ్య, రాజు, కిషోర్ పాల్గొన్నారు.


మంత్రి కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

లాలాపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి ఆర్టీసీ కార్మికులకు గతంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని టీఎస్ ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ డిమాండ్ చేశారు. గురువారం తార్నాకలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, పువ్వాడ అజయ్ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలపై ఇప్పటి వరకు ప్రస్తావనే లేదన్నారు. ఉప ఎన్నికలు జరిగి ఆరు నెలలు గడుస్తున్నా 2013 పే స్కేల్ బాండ్ ఆరియర్స్, 2019 నుంచి డీఏ బకాయిల ఊసే లేదన్నారు. దీనిపై రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులందరూ నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపేందుకు సిద్ధం అవుతున్నట్లు స్పష్టం చేశారు.

'సెకండ్స్' మార్కెట్‌కు ఆదరణ

- సెకండ్ హ్యాండ్ వాహనాలతో నయా మోడల్స్ మోజు తీర్చుకుంటున్న మధ్యతరగతి వర్గాలు
- కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు


విక్రయానికి సిద్ధంగా ఉన్న కార్లు

సనత్‌నగర్: సెకండ్ హ్యాండ్స్ కార్లు, బైక్‌ల మార్కెట్‌కు సనత్‌నగర్ నియోజకవర్గం ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుంది. నియోజకవర్గ పరిధిలోని అమీర్‌పేట్, సనత్‌నగర్, బల్కంపేట, ఎస్ఆర్‌నగర్, ఎర్రగడ్డ ప్రాంతాలు వ్యాపార, వాణిజ్య, ఆటోమొబైల్ కేంద్రాలకు నెలవుగా ఉన్నాయి. అదే స్థాయిలో ఆయా ప్రాంతాల్లో సెకండ్స్ హ్యాండ్స్ వాహనాల మార్కెట్ కూడా భారీగా విస్తరించుకుంది. దాదాపు అన్ని కంపెనీలకు చెందిన షోరూంలతో పాటు ప్రత్యేకంగా సెకండ్ హ్యాండ్ వాహనాల క్రయవిక్రయాల కోసం లెక్కకు మిక్కిలిగా ఈ ప్రాంతంలో వెలిశాయి.

మధ్య తరగతి ప్రజల ఆసక్తి..

మధ్య తరగతి కుటుంబీకులు న్యూమోడల్ వాహనాల కలను సెకండ్స్ మార్కెట్ ద్వారా తీర్చుకుంటున్నారు. తాము అనుకున్న ధరలో కారు గానీ, బైక్‌లు గానీ అందుబాటులోకి వస్తుండడంతో ఆ వర్గంవారు కార్ల కొనుగోలుకు సై అంటున్నారు. పాత వాహనాలను ఖరీదు చేసుకుంటున్న విక్రయ సంస్థలు కొనుగోలుదారులు మోజు పడ్డ వాహన ధరలో మినహాయించుకుని అమ్మకాలు సాగిస్తుండడం వారికి ఊరట లభిస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త వాహనం కొనుగోలుకు అయ్యే ఖర్చులో 50–70 శాతం వరకు తగ్గుతుండడంతో పాటు షోరూంలే బ్యాంక్ లోన్స్, ఫైనాన్స్ అందిస్తుండడంతో కారు ముచ్చటను తీర్చుకుంటున్నారు.

ఉపాధి కేంద్రంగా..

సెకండ్ హ్యాండ్ వాహన వ్యాపారంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా నగరవ్యాప్తంగా 2 లక్షల మంది ఉపాధి పొందుతుండగా, అమీర్‌పేట పరిసర ప్రాంతాల్లోనే రూ.50 వేల మంది ఉంటారని అంచనా. సేల్స్ మేన్‌గా ఇక్కడ అనుభవం గడించి ప్రముఖ షోరూంలలో ఉన్నత ఉద్యోగాలను సంపాదించేందుకు 'సెకండ్' మార్కెట్ పునాది వేస్తోంది.

నిపుణుల సలహాలు ఇవి..

సెకండ్ హ్యాండ్ వాహనం కొనుగోలు చేసే ముందు మార్కెట్లో నమ్మకమైన సంస్థ, దాని గుడ్‌విల్ గురించి ఆరా తీయాలని పలువురు నిపుణులు చెబుతున్నారు.

- వాహన కండిషన్‌పై పూర్తిగా అవగాహన ఉండే మెకానిక్ ద్వారా వెళ్లాలి.
- మీటరు రీడింగ్‌తో పాటు మెయింటెనెన్స్ ఏవిధంగా ఉందో తెలుసుకోవాలి.
- ఎక్కడపడితే అక్కడ సర్వీసింగ్ చేయించిన వాహనాల కన్నా ఒకే షోరూంలో చేయించిన వాహనాలైతే ఉత్తమం.
- రీడింగ్ ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉంటుంది. దీనిపై కూడా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఈ విషయంలో అనుభవం ఉన్న సెకండ్ హ్యాండ్ కార్ల సంస్థలను సంప్రదించాలి.
- వాహనం కొనుగోలు చేసిన వెంటనే డాక్యుమెంట్లను వెంటనే మీ పేరుపై మార్చుకోవాలి. లేదంటే కారు తాలూకూ ఏవైనా కేసులు ఉంటే అవి మీ మెడకు చుట్టుకునే ప్రమాదం ఉంటుంది.
- కొంతమంది పెట్రోల్ బండిలో కూడా డీజిల్ ఉపయోగించవచ్చని చెబుతారు. దాని వల్ల ఇంజిన్ సామర్థ్యం దెబ్బతింటుందనే విషయాన్ని గుర్తించాలని వివరిస్తున్నారు.

క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి..



ముఖ్యంగా ఒరిజినల్ డాక్యుమెంట్స్ ప్రధానం. కారుకు సంబంధించిన అన్ని రకాల పత్రాలు సరిగా ఉన్నాయా లేవా అని పరిశీలించుకోవాలి. అలాగే కారు కండిషన్ గురించి సాంకేతిక పరీక్షలపై అవగాహన కలిగిన వ్యక్తికి చూపించి మరీ కొనుగోలు చేసుకోవాలి. అంతా బాగుంది అని నమ్మించినా కొనుగోలుదారులు తప్పనిసరిగా పలుమార్లు క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి.

–ప్రవీణ్‌రెడ్డి, మెకానికల్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు